క్లుప్తంగా

వైభవంగా వసంతోత్సవ చక్రస్నానం



కొల్లిపర: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యహోమం , బలిహరణ పూజలు నిర్వహించి వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

24న క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

తెనాలి అర్బన్: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 24న తెనాలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌జీవో ప్రతినిధులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొనాలని కోరారు.

ప్రచార వాహనాలకు అనుమతులు తప్పనిసరి

తెనాలిరూరల్: ఎన్నికల నేపథ్యంలో ప్రచారాలు, ర్యాలీలు, బహిరంగ సభలకు వినియోగించే వాహనాలకు అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా అనుమతులు పొందాలని తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో లేదా ఎలక్షన్ కమిషన్ 'సువిధ' యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనుమతులు లేని వాహనాలను ర్యాలీలు, ప్రచారాలు, ఇంటింటి ప్రచారాలకు వినియోగిస్తే ఎలక్షన్ కమిషన్ నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తెనాలి నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు సంబంధించి 08644–232475 నంబరులో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

విమోచన పండుగల నిర్వహణకు విరాళం

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో గ్రేస్ ఆఫ్ జీసస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన విమోచన పండుగల నిర్వహణకు రూ.5 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఫెలోషిప్ కోశాధికారి ఎం.బర్నబాబు గురువారం తెలిపారు. తెనాలి రూరల్ మండల పాస్టర్ అండ్ గాస్పల వర్కర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఎ.భానుప్రాద్ ఆధ్వర్యంలో నగదు విరాళం అందజేసినట్లు చెప్పారు. రూరల్ గ్రామాల్లో దేవుని సేవ చేస్తున్న పాస్టర్లు, దైవజనులను ప్రోత్సహించేందుకు అసోసియేషన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి మార్కెట్ సెంటరులో ఉన్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు గురువారం తనిఖీ చేశారు. అతని వద్ద తొమ్మిది క్వార్టర్లు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణా వాటర్ పైపులైను లీకేజీ

మంగళగిరి: కృష్ణానది నుంచి తెనాలి వెళ్లే తాగునీటి పైపులైను లీకయిన ఘటన చోటు చేసుకుంది. కృష్ణానది నుంచి తెనాలికి తాగునీటి పైపులైను నగర పరిధిలోని ఆత్మకూరు మీదుగా వుంది. పైపులైను పగలడంతో నీరు భారీగా పొలాల్లోకి చేరింది. గురువారం మధ్యాహ్నం పైపులైనుకు డ్యామేజీ ఏర్పడగా సాయంత్రం వరకు అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో నీరు పొలాల్లోకి పారుతుంది.

విద్యార్థులకు వ్యాయామంపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో పోషణ అభియాన్ పక్షోత్సవాల సందర్భంగా గురువారం, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, విద్యార్థులకు అంగన్‌వాడీలు పోషకాహారం, వ్యాయామం గురించి అవగాహన కల్పించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు ఇవ్వాలని చెప్పారు. రక్తహీనత ద్వారా పిల్లలు అనారోగ్యానికి గురవుతారని దాని నియంత్రణకు పాలు, గుడ్డు, ఆకు కూరలు, క్యారెట్ వంటి పదార్థాలు ఆహారంలో పిల్లలు తీసుకునేలా చూడాలని తెలిపారు. అనంతరం విద్యార్థులచే వ్యాయామం చేయించారు. అంగన్‌వాడీలు పద్మ, నాగలక్ష్మి, మరియజోజమ్మ, పాఠశాల హెచ్ఎం దివి కమల్‌మోహన్, శేషురవి పాల్గొన్నారు.

అన్నదాతలకు ఆర్థిక భరోసా

- రైతు సేవలో తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ
- గిట్టుబాటు ధర లభించడంతో కర్షకుల హర్షం
- ప్రతి శనివారం గొర్రెల సంత నిర్వహణ
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఎద్దుల బండి రైతు విగ్రహం



మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎద్దుల బండి, రైతు విగ్రహం

తెనాలిటౌన్: తెనాలిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నియోజకవర్గంలోని రైతులకు పలు రకాల సేవలు అందిస్తోంది. రైతు పక్షపాత ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు మార్కెట్ కమిటీల ద్వారా అందిస్తున్నారు. యార్డులో ప్రధానంగా నిమ్మకాయల విక్రయం జరుగుతుంది. రైతులు తాము పండించిన నిమ్మకాయలను మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముతుంటారు. మార్కెట్‌యార్డులో సుమారు 156 మంది వర్తకులు లైసెన్సు పొంది వ్యాపారం నిర్వహిస్తున్నారు. మార్కెట్ ఫీజు వసూలులో గత మూడు సంవత్సరాల నుంచి ముందంజలో ఉండి లక్ష్యం దాటి వసూలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీ పరిధిలో ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం, రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కమిటీ ఆధ్వర్యంలో నందివెలుగు, పెదరావూరు, బుర్రిపాలెం, జాగర్లమూడి, తెనాలి కార్యాలయం వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది చెక్ పోస్టుల ద్వారా రూ.6.26 కోట్లు వసూలు చేసి లక్ష్యాన్ని మించినట్లు మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు తెలిపారు.

గొర్రెల సంత నిర్వహణ

మార్కెట్ యార్డు ఆవరణలో ప్రతి శనివారం గొర్రెల సంతను నిర్వహిస్తున్నారు. ప్రతివారం



మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం

మార్కెట్ ఫీజు వసూలు వివరాలు

సంవత్సరం	లక్ష్యం	వసూలు చేసిన ఫీజు
2021–22	రూ.5.65 కోట్లు	రూ.4.07 కోట్లు
2022–23	రూ.5.70 కోట్లు	రూ.6.05 కోట్లు
2023–24	రూ.6.20 కోట్లు	రూ.6.26 కోట్లు

సుమారుగా 300 గొర్రెలు కొనుగోలు, అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రతి జీవానికి రూ.50 వంతున మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నారు. ఏడాదికి గొర్రెల సంతపై సుమారు రూ.3 లక్షలు మార్కెట్ ఫీజు వస్తుంది. ఇది కమిటీకి అదనపు ఆదాయంగా ఉంది. ప్రజలకు సరసమైన ధరలకు కూరగా



మార్కెట్ కమిటీ కార్యాలయ ముఖద్వారం

యాలు అందించేందుకు పట్టణంలో మూడు రైతు బజార్లను ఏర్పాటు చేశారు. దీని ద్వారా కూరగాయాలు పండించే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నారు.

ఎద్దులు, రైతు విగ్రహం ఏర్పాటు

మార్కెట్ కమిటీ ఆవరణలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహకారంతో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ అవుతు సీతనగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎద్దుల బండి, రైతు విగ్రహం ఏర్పాటు చేశారు. గత నెలలో విగ్రహాన్ని మార్కెటింగ్ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి ఆవిష్కరించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో ప్రతి రోజు రైతులు, ప్రజలు దీనిని సందర్శిస్తున్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయండి

సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించిన రైతు సంఘం నాయకులు

తెనాలిరూరల్: దుగ్గిరాలలో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించిన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లోని పసుపు బస్తాలను యజమాని అక్రమంగా తరలించే సన్నాహాలు చేస్తున్నాడని దీనిని అధికారులు అడ్డుకోవాలని కోరుతూ రైతు సంఘ నాయకులు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి గురువారం సాయంత్రం వెళ్లిన నాయకులు ఆయనను కలిసి తమ సమస్యను వివరించారు. అగ్ని ప్రమాదం జరిగి 62 రోజులైనా ఇప్పటికీ రైతులకు నష్ట పరిహారం అందలేదని వివరించారు. కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న పసుపు బస్తాల్లో వెయ్యి బస్తాలను యజమాని అక్రమంగా తరలించి అమ్ముకునే యత్నాలు చేస్తున్నాడని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువ



ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

చ్చారు. వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ దుగ్గిరాల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సీజ్ చేసి ఉన్న కోల్డ్ స్టోరేజ్‌లో సరుకును తరలించడమేమిటని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు వేములపల్లి వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డి, నాదెళ్ల సురేంద్ర, వెనిగళ్ల శివయ్య, పోతురాజు, కోటేశ్వరరావు, కొల్లి రమేష్, వి.రమేష్ ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

తాడేపల్లిరూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో వున్న ప్రతి పోలింగ్ బూత్‌పై పోలీసుల నిఘా ఉందని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేస్తే సహించేది లేదని తాడేపల్లి ఎస్ఐలు రమేష్, ప్రతాప్‌కుమార్ అన్నారు. గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురం, ప్రకాష్‌నగర్, కేఎల్‌రావు కాలనీల్లో సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తూ పలుచోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటు హక్కు వినియోగించుకునే వారిని భయభ్రాంతులకు లేదా ప్రలోభాలకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే తాడేపల్లి



కవాతు నిర్వహిస్తున్న తాడేపల్లి ఎస్ఐలు రమేష్, ప్రతాప్ కుమార్

పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి బూత్‌లో గత ఎలక్షన్‌లలో ఘర్షణకు దిగిన వారు, ప్రలోభాలకు గురిచేసిన వారిని బైండోవర్ చేశామని, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే వారిపై కేసులు నమోదు చేస్తామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

పన్నుల వసూలు లక్ష్యం పూర్తికావాలి

కమిషనర్ వి.నిర్మల్ కుమార్

మంగళగిరి: మార్చి నెలాఖరుకు పన్నుల వసూలు లక్ష్యాన్ని పూర్తిచేయాలని మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ఆదేశించారు. పన్నుల లక్ష్యంపై గురువారం పట్టణంలోని కార్పొరేషన్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లను సిబ్బంది మరింత వేగవంతం చేయాలన్నారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో ప్రతిరోజూ రెవెన్యూ అధికారులు సమీక్షించి పన్నుల వసూలు పెరిగేలా చూడాలన్నారు. ప్రతిరోజు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వి.నిర్మల్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ బి.శివారెడ్డి

వార్డులలో తిరిగి పన్నులు వసూలు చేయాలన్నారు. మొండి బకాయిల యజమానులతో సామరస్యంగా చర్చించి లక్ష్యం నెరవేరేలా చూడాలన్నారు.

గేమింగ్ యాప్‌ల రూపకల్పనలో మెళకువలు అవసరం

తాడేపల్లిరూరల్: విద్యార్థులు గేమింగ్ యాప్‌లను రూపొందించడంలో మెళకువలు నేర్చుకోవాలని కేఎల్‌యూ ప్రోగ్రెషన్ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో ఏర్పాటు చేసిన సినీ ఫిలియా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లకు మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు. అనంతరం లలిత కళల విభాగం అధిపతి సుభాష్‌తో కలసి పేజ్ టు పిక్చర్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలు సుప్రజ, ఆర్.వెంకన్న బాబు, జె.శ్రీధర్ పట్నాలను అభినందించారు. విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ లలిత కళల విభాగం విద్యార్థులు సినీ ఫిలియా కార్యక్రమంలో భాగంగా పలు రకాల ఫొటో ఆల్బమ్‌లు, వీడియో



పేజ్ టు పిక్చర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రోగ్రెషన్ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్

డాక్యుమెంటరీలు తయారు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, డిప్యూటీ విభాగాధిపతి జాలాది రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విజయానికి బాటలు వేద్దాం



తెనాలిఅర్బన్: రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించేందుకు అంతా సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. పట్టణంలోని 7వ వార్డులో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రాళ్లబండి సుష్మ, మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, కొమ్మర బత్తిన జయపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనిషి జీవితాన్ని ప్రభావితం చేసేది సాహిత్యం



పాత గుంటూరు: మనిషి జీవితాన్ని ప్రభావితం చేసేది సాహిత్యమని, అమరావతి సాహితీ మిత్రులు డాక్టర్ రావి రంగారావు అన్నారు. అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా గురువారం డాక్టర్ పట్టాభి కళా పీఠం, మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీ పేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు కళా పీఠం అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ మనో వికాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా సాహిత్య ప్రక్రియలు దోహదపడతాయన్నారు. 60 మంది కవులు పాల్గొని, తమ కవితలు వినిపించి దేశ భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బండికల్లు వెంకటేశ్వర్లు, జమదగ్ని, పొత్తూరి సుబ్బారావు, డాక్టర్ సేవాకుమార్, నిష్టల సుబ్రహ్మణ్యశాస్త్రి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- 24 గంటలూ నిరంతర నిఘా
- 85 శాతం పోలింగ్ నమోదుపై దృష్టి
- తెనాలి సబ్‌కలెక్టర్/నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్



తెనాలి: అన్ని రాజకీయ పార్టీలతో సహా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి/సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల కార్య కలాపాలపై ప్రత్యేక బృందాల నిఘా 24 గంటలూ ఉంటుందని గుర్తుచేశారు. తన కార్యాలయంలో గురువారం నోడల్ అధికారులతో సమావేశమైన ప్రఖర్‌జైన్ 'సాక్షి'తో మాట్లాడారు. ఈ నెల 16న ప్రధాన ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల షెడ్యూలును విడుదల చేసిన వెంటనే కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చిందని చెప్పారు. రాజకీయ పార్టీల బహిరంగ సభలు, సమావేశాలు, ప్రదర్శనల నిర్వహణకు ముందుగా అనుమతులు తీసుకోవాలని ప్రఖర్‌జైన్ స్పష్టం చేశారు. ఇందుకోసం ఆయా పార్టీల వారు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేస్తారని, ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిన ప్రత్యేక యాప్ 'ఎన్‌కోర్ పోర్టల్'కు ఆ దరఖాస్తు వస్తుందని తెలిపారు. అందులో తనతో సహా అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు ఉంటారని చెప్పారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) ఇస్తారని చెప్పారు. లేదా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేయొచ్చని తెలిపారు. దరఖాస్తు చేసిన 48 గంటల్లో అనుమతులు ఇస్తామన్నారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ పార్టీల ప్రచార ఫ్లెక్సీలకు అనుమతి లేదని అలా ఉంచిన ఫ్లెక్సీలను ఇప్పటికే తొలగించినట్లు గుర్తు చేశారు. ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటుకూ అనుమతి లేదని చెబుతూ అందుకు సంబంధిత భవన యజమానుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌ను అనుసరిస్తున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు పట్టణంలో ఒకటి, కొల్లిపర, తెనాలి రూరల్ మండలాల్లో చెరొకటి చొప్పున మొత్తం ఆరు బృందాలతో షిఫ్టుల వారీగా 24 గంటల నిఘా ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ వెల్లడించారు. వీడియో సర్వైలెన్స్ టీమ్ ఆ దృశ్యాలను చిత్రీకరిస్తుందని మరో బృందం ఆయా వీడియోలను తిలకిస్తుందని తెలిపారు. అవి ఎన్నికల కోడ్ ప్రకారమే జరిగాయా? లేదా? అనేది పరిశీలిస్తుందని చెప్పారు. కౌంటింగ్ టీమ్ ఖర్చులను లెక్కించి సంబంధిత అధికారికి వివరాలను పంపుతుందని వివరించారు. వీటన్నింటి పర్యవేక్షణకు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోలు రూమ్ (నెం.08644–232475)ను ఏర్పాటు చేశామని తెలియజేశారు. నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులను కంట్రోల్ రూమ్‌కు తెలియజేయవచ్చని చెప్పారు. 2019లో తెనాలి నియోజకవర్గంలో 77.3 శాతం పోలింగ్ నమోదైందని ప్రఖర్‌జైన్ గుర్తుచేశారు. ఈసారి 80 శాతం పోలింగ్ జరిగేలా చూడాలని లక్ష్యం ఉన్నప్పటికీ తాను 85 శాతం పోలింగ్ నమోదుకు కృషి చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను సమకూరుస్తామని చెప్పారు. యువతీ యువకులు, మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏడు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ఓటర్లు ఓటు చేసేలా ప్రత్యేక దృష్టిని పెట్టామని చెప్పారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ మే 13న జరిగే ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఓటు ఆవశ్యకతను గుర్తించండి



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రధాన్యత ఉందని దానిని సక్రమంగా వినియోగించడం వలన మంచి పాలకులు వస్తారని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ (సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమాన్ని జేఎంజే కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని చెప్పారు. అర్హులైన వారు తమ ఓటును నమోదు చేయించుకుని వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రలోభాలకు లోను కాకుండా ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతా ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి పెట్టండి

తెనాలిఅర్బన్: ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు లేకుండా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మౌలిక వసతులపై ఆరా తీశారు. ఓటర్లకు కావాల్సిన మంచి నీరు, మరుగుదొడ్లు, విద్యుత్‌దీపాలు వంటి వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో గాలి, వెలుతురు ఎక్కువగా వచ్చే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, డీఈ నాగభూషణం, ఏసీపీ సుబ్బారావు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలి

తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు



తాడికొండ: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సువిధ క్యాండిడేట్ యాప్ ద్వారా ఎన్నికల్లో పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్‌లు తమ ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించిన అనుమతులు తప్పక తీసుకోవాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడ్ ఆఫ్ కండక్ట్ ఈ నెల 16 నుంచి అమలులో ఉన్నందున ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా అన్ని వ్యవస్థల నుంచి పార్టీల కార్యాకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేటు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్లు, పోస్టర్లు, జెండాలు తొలగించడం జరిగిందన్నారు. అధికారుల కళ్లుగప్పి ఎక్కడైనా అనధికారికంగా పోస్టర్లు, ఇతర ప్రచారాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు తాడికొండ నియోజకవర్గంలో 4 ఫిర్యాదులు సీ విజిల్ యాప్ ద్వారా అందగా వెంటనే పరిష్కరించి సంబంధిత పోస్టర్లు తొలగించినట్లు తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పార్టీలకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొనడం వంటివి జరిగినా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. నిబంధనల మేరకు ఒక్కొక్కరు రూ.50వేలు పై బడిన నగదు, రూ.10 వేలు విలువ పైబడిన బంగారం రసీదులు లేకుండా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వాటిని సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించడం జరుగుతుందన్నారు. సువిధ యాప్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం కుదరని అభ్యర్థులకు మాన్యువల్‌గా కూడా దరఖాస్తు చేసే అవకాశం ఉందన్నారు. తాడికొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక్కడ 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉంటారనానరు. హెల్ప్ డెస్క్ నంబర్లు 8074495632, 8125146794 లను ఫోన్ ద్వారా సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.


చిన్నారుల స్నాతకోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: తల్లిదండ్రులు తమ బిడ్డల బంగారు భవిష్యత్తును పట్టభద్రులుగా చూసుకునే తొలి మెట్టు బాలల స్నాతకోత్సవమని ప్రజ్ఞ విద్యా సంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. గురువారం నగరంపాలెంలోని ప్రజ్ఞ మెడిటెక్నో పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసుకున్న బాల, బాలికలు ఒకటవ తరగతిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ బాలల స్నాతకోత్సవం నిర్వహించారు. పట్టభద్రుల మాదిరిగా



చిన్నారులకు బ్లాక్ యాప్రాన్, క్యాప్ ధరింపజేసి పాస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాయుడు కోటేశ్వరరావు ఉపాధ్యాయులు లలిత, మాధవి, యశోద పాల్గొన్నారు.

24న షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సాలసబస్టాండు సెంటరులో షిర్డీ సాయినాథ మందిర ,శీతలాంబ వార్షికోత్సవం ఈనెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయపాలక వర్గం సభ్యులు యల్లారెడ్డి, వై.శ్రీనివాసరెడ్డిలు గురువారం తెలిపారు. 24న ఉదయం నగర సంకీర్తన, కాగడహారతి, గణపతి పూజ, పుణ్యాహవాచన, నవగ్రహారాధన, అష్టదిక్పాలపూజ. విశేష అర్చనలు అర్చకులు కె.రాఘవేంద్రశర్మ, వైఖానస ఆగమ పండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నిర్వహిస్తారని చెప్పారు. 25న విశేష అర్చనలు, అభిషేకాలు, సాయి, హనుమాన్ చాలీసాను పరవస్తు చిన్నయసూరి, గీతాభజన మండలి సభ్యులు గానం చేస్తారన్నారు. 26న విశేష అర్చనలు, భక్తులతో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఉంటుందని చెప్పారు. సాయంత్రం సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com